క్లుప్తంగా

ఘనంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మధిర: మడుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అలివేలుమంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. గత రెండు రోజులుగా శ్రీ వేకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున స్వామి కల్యాణం నిర్వహించగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తులసి దంపతులు పీటలపై కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

లక్ష్మీ గణపతికి సారె సమర్పణ

సత్తుపల్లిరూరల్: స్థానిక పెద్ద వంతెన వద్దగల శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలోని అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా స్థానిక మహిళలు బుధవారం సారె, ఒడిబియ్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తేరాల సుబ్రమణ్యశాస్త్రి పసుపు, కుంకుమలతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అప్పారావు, వినోదరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశం, నగరేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 13.71లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆపార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణలు పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

చింతకాని: మధిర నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. సమావేశంలో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, ప్రభారి మండడపు సుబ్బారావు, మండల అధ్యక్షుడు గోపి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు అనురాధ, అనూష

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో బుధవారం విద్యుత్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన రెండు 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మధిర ఏడీఈ అనురాధ, ఏఈ అనూషలు ప్రారంభించారు. కార్యక్రమంలో జేఎల్ఎం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బుధవారం రాత్రి బీఆర్ఎస్, సీపీఎం నుంచి 170 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బందం నాగేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీను, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ షాజాహాన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ప్రమీల, ముస్తాఫా, మురళి పాల్గొన్నారు.

పటిష్ట చర్యలు చేపట్టాలి

ముదిగొండ: వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద కమిటీ నిర్వాహకులు విద్యుత్ లైన్ల పరంగా పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలు ఊరేగింపు సమయంలో విద్యుత్ వైర్లు తగలకుండా చూసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలపాలన్నారు.



ఇరుకుగా ఉన్నతమ్మిలేరు బ్రిడ్జి



ప్రత్యామ్నాయ కాలువ బ్రిడ్జిపై తేలిన చువ్వలు



కూలిపోయిన సైడ్‌వాల్స్

ప్రయాణం.. ప్రాణసంకటం

ప్రమాదకరంగా తమ్మిలేరు బ్రిడ్జి

- వంతెనపై అడుగడుగునా గుంతలు
- దెబ్బతిన్న సైడ్‌వాల్స్
- భయం భయంగా ప్రయాణాలు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు

సత్తుపల్లిటౌన్: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే తమ్మిలేరు బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. సత్తుపల్లి శివారున జాతీయ రహదారిపై ఉన్న ఈ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. అడుగడుగున గుంతలు ఉండటంతో వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. బ్రిడ్జి సైడ్ వాల్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు ఆందోళనకు గురికావాల్సి వస్తోంది.

కష్టంగా ఉంది..



తమ్మిలేరు వంతెనపై వాహనాలు నడపటం చాలా కష్టంగా ఉంది. వాహనాలు గోతుల్లో దిగితే ఇక అంతే సంగతులు.. సైడ్ వాల్ లేకపోవడంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు ఇంకా టెన్షన్ పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తమ్మిలేరు వంతెనపై గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాలి.

– జి.కృష్ణారెడ్డి, సత్తుపల్లి

అసలే ఇరుకు.. ఆపై గుంతలు..

తమ్మిలేరు వాగుపై ఉన్న ఈ బ్రిడ్జి మలుపులో ఉండటంతో గతంలో అనేక వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. భారీ వాహనాలు సైతం వాగులో పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండటం.. గోతులు పడటం.. సైడ్ వాల్స్, రైలింగ్ సరిగ్గా లేకపోవటంతో ఈ బ్రిడ్జిపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు తదితర వాహనాల టైర్లు గోతుల్లో దిగినప్పుడు ఆయా వాహనాలు వెనుక వచ్చే వాహనాలు ఢీ కొట్టడంతో ప్రమాదాలకు గురౌతున్నాయి. తెలంగాణ – ఆంధ్రా సరిహద్దు సమీపంలో ఉన్న ఈ వంతెన మీదుగా భారీ వాహనాలతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటారు. వర్షాలకు పడిన గుంతలకు నెలల తరబడి మరమ్మతులు చేపట్టకపోవటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తక్షణమే తమ్మిలేరు బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ కాలువ వంతెనపై..

పట్టణంలోని ఎన్టీఆర్ ప్రత్యామ్నాయ కాలువ బ్రిడ్జిపై పడిన గోతుల్లో నుంచి చువ్వలు బయటకు తేలాయి. ఈ గుంతల్లో వాహనాలు దిగినప్పుడు ప్రమాదాల భారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ వంతెనలపై ప్రయాణం యమ డేంజర్‌గా మారిందని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం బ్రిడ్జిలపై మరమ్మతులు చేపట్టి ఆదుకోవాలని కోరుతున్నారు.

సీపీఎం ఆందోళన..



బ్రిడ్జిపై ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లి: శిలావస్థకు చేరిన తమ్మిలేరు బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం బ్రిడ్జిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొత్తబ్రిడ్జి నిర్మించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య, సనందరావు, వెంట్రావ్, పున్నయ్య, జగపతిరావు, భాస్కర్, రాంబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు..



రావినూతలలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ స్వర్ణవిజయచంద్ర

బోనకల్: రైతులకు సరిపడా ఎరువులు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఏ స్వర్ణ విజయచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని ఎరువుల దుకాణాలతో పాటు స్టాక్ పాయింట్లను పరిశీలించారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, సేల్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ధరకే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్‌కుమార్, విస్తరణాధికారులు గోగుల హరికృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి



రాఘవాపురంలో పెసర పంటను పరిశీలిస్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు

చింతకాని: అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దొబ్బల వెంగళరావు, పడిమెల వెంకటనర్సయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొదుమూరు, వందనం, రాఘవాపురం గ్రామాల్లో తెలంగాణ రైతు సంఘం నాయకులు పత్తి, పెసర పంటలను పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలకు చేతికొచ్చిన పెసర పంటతో పాటు పత్తి పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. అదే విధంగా రైతులందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సింగారపు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వేముల జానికి రాములు, గోగుల ఆదినారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి కొల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

రూ.25వేలు అందించాలి..

పత్తి పంట నష్టపోయిన రైతులకు రూ.25వేలు పరిహారం అందించాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పాతర్లపాడు గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రైతులకు క్యూలో నిలబడే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు, మండల కార్యదర్శి రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఎర్రుపాలెం: విద్యారంగ సమస్యలపై ఈనెల 23న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమమోలు కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావులు కోరారు. బుధవారం మండలకేంద్రంలో, జమలాపురం గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, నాయకులు తదితరులున్నారు.

బోనకల్: మండల కేంద్రంలో బుధవారం టీఎస్ యూటీఎఫ్ సంఘం సమావేశంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 20నెలలు గడుస్తున్నా నేటికి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు రంగారావు, గోపాల్‌రావు, నరసింహారావు, నరేంద్రసింహ, నరేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో వివిధ పాఠశాలలను టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, నాయకులు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల నాయకులు ఇమ్మానియేల్, రాజు, పుల్లయ్య, అనంతరాములు, గోపాల్, ఉషారాణి, సౌభాగ్య, రమాదేవి, శివ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

➡ మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

సత్తుపల్లి(కల్లూరు): ఒంటరి మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కల్లూరు మండలం పాత మాలపల్లికి చెందిన బేతుమల్ల నాగరాజు భర్తకు దూరంగా నివసిస్తున్న ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమెను శారీరకంగా, ఆర్థికంగా వాడుకుని తనకేం సంబంధం లేదని చెప్పడమే కాక దాడి చేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు.

➡ పీఎస్ వద్ద పురుగుల మందు తాగిన వ్యక్తిపై..

కారేపల్లి: పోలీసుస్టేషన్ ఆరుబయట పురుగుల మందు తాగిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ బి.గోపి తెలిపారు. కారేపల్లి క్రాస్‌రోడ్డు గ్రామానికి చెందిన పాలెపు వీరభద్రం ఈనెల 19న మద్యం సేవించి స్టేషన్‌కు చేరుకుని సమీపాన పురుగుల మందు తాగాడు. ఈమేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

➡ ఇద్దరికి గాయాలు

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్ నగర్ సమీపాన జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాంధీనగర్‌తండా వైపు నుంచి తల్లాడ వైపు నడిచి వస్తున్న మతిస్థిమితం లేని వృద్ధురాలిని వెంగన్నపేటకు చెందిన జినుగు వెంకటి మోటార్ సైకిల్‌పై వెళ్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈఘనలో వృద్ధురాలు, వెంకటి గాయపడగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సింగరేణి ఎంపీడీఓగా శ్రీనివాసరావు



బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు

కారేపల్లి: సింగరేణి ఎంపీడీఓగా పొన్నూరు శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇక్కడ ఎంపీడీఓ విధులు నిర్వర్తించిన సురేందర్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఎంపీఓ రవీంద్రప్రసాద్ విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. కొత్తగూడెం డీఆర్‌డీఓలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై సింగరేణి మండలానికి వచ్చారు.

అనుమతి తీసుకోవాలి



కల్లూరు ఎస్సై హరిత

తల్లాడ: మండలంలో వినాయక మండపాల ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ వారు తప్పనిసరిగా పోలీస్ పర్మిషన్ తీసుకోవాలని ఎస్.ఐ.ఎన్.వెంకటకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయకుడి విగ్రహం పెట్టే స్థలంలో స్థలదాత అంగీకార పత్రం, విద్యుత్ శాఖా అనుమతి పత్రములు పోలీస్ శాఖకు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా శృతి మించి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు వినాయక మండపాల ఏర్పాటు చేసే వారు తల్లాడ పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరారు.

కల్లూరురూరల్: వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలి కల్లూరు ఎస్సై డి.హరిత పేర్కొన్నారు. వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధిత స్థల దాత అనుమతి అంగీకార పత్రం, విద్యుత్ శాఖ నుంచి అనుమతి పత్రాలను పోలీస్‌శాఖకు అందించాలని, మండపాల్లో డిజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయొద్దన్నారు. అనుమతులు తీసుకోకుండా మండపాలు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

నిబంధనలు లేకుండా యూరియా అందించాలి



మాట్లాడుతున్న రమేష్

పెనుబల్లి: పాస్ బుక్ నిబంధన లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. బుధవారం మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలైలో రావాల్సిన యూరియా రాకపోవడంతో ఆగస్ట్‌లో అరకొరగా సరఫరా చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు,మండల కార్యదర్శి గాయం తిరుపతి రావు,తడికమళ్ళ చిరంజీవి,విశ్వనాధం, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలకు నాణ్యమైన విద్యనందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించి వారి భవిష్యత్‌ను బంగారుమయం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచించారు. బుధవారం వైరాలోని బీసీ గురుకులాన్ని ఆయన సందర్శించి బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణ, డార్మెటరీ, కిచెన్ షెడ్ తదితరాలు పరిశీలించారు. పాఠశాలలో సమస్యలేంటి, ఎంత మంది బాలికలు చదువుతున్నారు తదితర విషయాలను పాఠశాల ప్రిన్సిపల్ రాధికను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బొర్రా రాజశేఖర్, దొబ్బల సౌజన్య, దార్న రాజశేఖర్ తదితరులున్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ పరిశీలన



సత్తుపల్లిరూరల్: ఎన్టీఆర్ కాల్వ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

సత్తుపల్లి రూరల్/తల్లాడ: సత్తుపల్లిలోని పాత ఎన్టీఆర్ కాలువను పూడ్చి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచనతో కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ విరాట్‌నగర్‌లోని పాత ఎన్టీఆర్‌కాలువతో పాటు రేజర్లలోని కాలువ ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అలాగే, రేజర్ల పెద్దచెరువు బతుకమ్మ ఘాట్‌ను సైతం వారు పరిశీలించారు. ఆతర్వాత తల్లాడ మండలంలోని పినపాకలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అనువైన స్థలాలను ఎమ్మెల్యే రాగమయి, సబ్ కలెక్టర్ అజయ్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్, నీరజ, తహసీల్దార్లు సత్యనారాయణ, సురేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయాలు..

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వైరా: బెతస్త ప్రత్యక్షణ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో.. వైరా మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి 7వ వార్డులోని వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైరా ఎస్ఐ పి.రామారావు హాజరై వృద్ధులకు అందించి మాట్లాడారు. నిరుపేదలు, అనాథలకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పాస్టర్ ఎస్‌కే పాలు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పణితి సైదులు, పాస్టర్లు మధు, జయరాజు, తిమోతి, స్టీవెన్‌పాల్, నతానియేలు, క్రీస్తుదాసు, కోటేశ్వరరావు, దారా వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ..



కల్లూరురూరల్: స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని మర్లపాడులో గల ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10వేల విలువైన నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ప్లేట్లు, స్టడీ మెటీరియల్స్, డైరీలను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరికోటి రూపా అందించిన వస్తువులను.. ఫౌండేషన్ నిర్వాహకుడు దయాల కిషోర్ దత్ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేష్, వీరబాబు, కృష్ణ, సత్యంబాబు, శ్రీనివాసరావు, హనిమిరెడ్డి, సురేష్, కాంతారావు పాల్గొన్నారు.

సత్కారాలు..

ఫొటో గ్రాఫర్లకు సత్కారం



ఫొటో గ్రాఫర్లతో ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లిటౌన్: వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని ఫొటో గ్రఫీలో రాణించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో సత్తుపల్లిలోని సీనియర్ ఫొటో గ్రాఫర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నారావు, నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరావు, కమల్‌పాషా, ఫొటో గ్రాఫర్లు సతీష్‌రెడ్డి, రాము, కనకారావు, పాషా, మూర్తి, రాంబాబు, హరి, కోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



వీరబాబును సన్మానిస్తున్న నాయకులు

తల్లాడ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గంధాలయ సంస్థ చైర్మన్ భాధ్యతలు చేపట్టి తొలిసారిగా తల్లాడ వచ్చిన పసుపులేటి వీరబాబును మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. మున్నూరు కాపు సంఘం కన్వీనర్ దాలంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మల్లవరం మాజీ ఉప సర్పంచ్ ఎర్రి నరసింహారావు, మున్నూరు కాపు సంఘం మండల ఉపాధ్యక్షులు వేలాద్రి, కటికి ప్రసాద్, దొనకొండ ఉపేందర్, కుప్పాల నరసింహారావు, కంభంపాటి కాళేశ్వరరావు, సంపటం ప్రసాద్, అంజయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మీ సేవా సెంటర్ల బాధ్యులు

బోనకల్: ఉత్తమ తహసీల్దార్‌గా.. బోనకల్ తహసీల్దార్ ఎం.రమాదేవి అవార్డు తీసుకుంది. ఈ సందర్భంగా బుధవారం మండల తహసీల్‌లో మీసేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో మీసేవా మండల అధ్యక్షుడు రవికుమార్, కోటేశ్వరరావు, అఫీజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత

కొణిజర్ల: ప్రజలు ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమల నిర్మూలనలో భాగం పంచుకోవాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.రమణ సూచించారు. కొణిజర్ల మండలంలోని చిన్నగోపతి, అనంతారం, పెద్దగోపతి, కొణిజర్లల్లో బుధవారం ఆయన వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. అలాగే, అనంతారం ప్రాథమిక పాఠశాలలో దోమలతో వచ్చే వ్యాధులు, నిర్మూలన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యులు రాధాకృష్ణ, శారద, ఉద్యోగులుతదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి సాగు విధానంపై అవగాహన

ఏన్కూరు: మండలంలోని ఎర్రబోడు తండాలో బుధవారం రైతులకు తడి, పొడి సాగు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్, వ్యవసాయశాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేకేఎఫ్ ప్రతినిధులు జాని పాషా, గఫూర్, రవితేజ రైతులకు వివరించారు. మండల ఏఓ నరసింహారావు, ఏఈఓ బాలకృష్ణ, సాంకేతిక సూచనలు చేశారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ప్రధానమంత్రిగా దేశానికి రాజీవ్‌గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో..



ఏన్కూరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్